అగ్రివర్సిటీ భూములను ధారాదత్తం చేస్తే ఊరుకోం

- బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగ బాలు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: వ్యవసాయ యూనివర్సిటీ భూములను పాలకుల స్వలాభం కోసం ధారాదత్తం చేస్తే చూస్తూ ఊరుకోబోమని బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగ బాలు హెచ్చరించారు. వర్సిటీ భూముల్లో హైకోర్టు నిర్మించాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడి భూముల్లో అరుదైన ఔషధ మొక్కలు ఉన్నాయని గుర్తు చేశారు. వాటిని ధ్వంసం చేసి, వ్యవసాయ పరిశోధనలు నిలిచిపోయేలా కుట్ర జరుగుతున్నది ఆరోపించారు. భూములను కాజేసి, వర్సిటీని భ్రష్టు పట్టించాలని చూస్తే విద్యార్థి లోకం చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు. హైకోర్టు నిర్మాణాన్ని తాము వ్యతిరేకించడం లేదని, వర్సిటీ భూములను లాక్కోవడాన్నే వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు.

ప్రభుత్వ సలహాదారుల్లో బీసీలు ఎందుకు లేరు?

- జాజుల శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుల్లో కనీసం ఒక్క బీసీనైనా ఎందుకు నియమించలేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు రూ.30 వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన సచివాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతి కోసం చటబద్ధమైన పథకాలు అమలు చేయాలని, వృత్తి విద్యా కాలేజీలు, ఫైనాన్స్ కో-ఆపరేటివ్ బ్యాంకులతోపాటు 5 ఎకరాల్లో పూలే దంపతుల స్మృతివనాన్ని, పూలే నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా బీసీని నియమించాలని, బీసీల కులగణన తర్వాతనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

చందన చెరువు శిఖంలో కబ్జాల తొలగింపు

- నిర్మాణాలను కూల్చివేసిన రెవెన్యూ సిబ్బంది
- చెరువు శిఖంలో సూచిక బోర్డులు ఏర్పాటు
- నర్సరీలు, మరి కొన్నింటికి సమయం ఇచ్చాం
- బాలాపూర్ తహసీల్దార్ మాధవీరెడ్డి

శిఖం భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

బడంగ్‌పేట, జనవరి 23: రంగారెడ్డి జిల్లా కందుకూరు డివిజన్ జల్‌పల్లి పరిధిలోని చందన చెరువు కబ్జాపై 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'చందన చెరువు శిఖం ఫలహారం' శీర్షికతో ప్రచురితమైన వరుస కథనాలతో అధికారులు కదిలివచ్చారు. చెరువు శిఖం భూమిలో కబ్జా వాస్తవమేనని రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. శిఖంలోని అక్రమ నిర్మాణాలను తాసీల్దార్ మాధవీరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. సర్వే నంబర్ 155లో ఉన్నది చందన చెరువు శిఖం భూమి అని సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ.. చెరువు శిఖంలో వెలసిన నిర్మాణాలను మాత్రమే తొలగించామని చెప్పారు. శిఖంలో ఉన్న సిమెంట్ బ్రిక్స్ తయారీ కేంద్రాన్ని, నర్సరీ నిబంధన ప్రకారం ఉంటాయా? ఉండవా? అన్న అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామని తెలిపారు. నర్సరీలను తొలగించడానికి కొంత సమయం తీసుకుంటామని చెప్పారు. బాలాపూర్ పరిధిలో వెలసిన అక్రమ నిర్మాణాలను సైతం తొలగించామని పేర్కొన్నారు. శిఖం భూమి తమదే అంటున్న వారి నుంచి ఆధారాలు తీసుకుంటామని, పూర్తి వివరాలు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రభుత్వ భూమిలో గానీ, చెరువుల పరిధిలో గానీ కబ్జాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రంగసముద్రం దీనావస్థపై సీఎంవోలో ఫిర్యాదు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 23 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం గిరికొత్తపల్లిలోని రంగసముద్రం చెరువు దీనావస్థపై ఆ గ్రామ రైతు సంఘం పోరాటం కొనసాగుతూనే ఉన్నది. ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో తొలుత ఫిర్యాదు చేశారు. కొందరు రియల్టర్లు రంగసముద్రంను చెర పట్టడంతో భూగర్భజలాలు గణనీయంగా పడిపోతూ గ్రామం ఎడారిగా మారే ప్రమాదం ఉన్నదని ఫిర్యాదులో ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం సచివాలయానికి వెళ్లి ముఖ్యమంత్రి కార్యాలయంలో కూడా గిరికొత్తపల్లి గ్రామ రైతు సంఘం పేరిట ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, రంగసముద్రం చెరువును పునరుద్ధరించి, గ్రామాన్ని ఆదుకోవాలని కోరారు.

కేఆర్ఎంబీ నిర్ణయం రాష్ట్రానికి గొడ్డలిపెట్టు

- తాగునీటికి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి
- సీఎంపై ఫిర్యాదును ప్రివిలేజ్ కమిటీకి పంపించాం
- బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్‌వి అహంకారపూరిత వ్యాఖ్యలు
- అవకాశం ఇస్తే నా కుమారుడు ఎంపీగా పోటీ చేస్తాడు
- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పరిధిలోకి వెళ్లడం రాష్ట్రానికి గొడ్డలి పెట్టులాంటిదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. దీనివల్ల భవిష్యత్‌లో సాగు, తాగునీటికి సమస్య ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ప్రాజెక్టులు కేఆర్ఎంబీ పరిధిలోకి పోకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని చెప్పారు. మంగళవారం ఆయన శాసనమండలిలోని తన చాంబర్‌లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. కేఆర్ఎంబీ నిర్ణయం వల్ల నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల్లో తాగునీటికి సమస్యలొచ్చే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. హైదరాబాద్ నగరానికి కూడా నాగార్జునసాగర్ ద్వారానే తాగు నీరు రావాల్సి ఉన్నదని గుర్తుచేశారు. వచ్చే వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించడానికి కర్ణాటక నుంచి నీళ్లు తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలని సూచించారు.

రేవంత్‌వి అహంకారపూరిత వ్యాఖ్యలు

సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌పై చేసిన వ్యాఖ్యలు అహంకార పూరిత ధోరణిని నిదర్శనమని గుత్తా విమర్శించారు. తాను పార్టీ అధిష్ఠానంపై నారాజ్‌గా ఉన్నట్టు సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, తాను ఏ పార్టీలోకీ వెళ్లడంలేదని, తాను ఎన్నికల్లో పోటీ చేయనని స్పష్టం చేశారు. సోమవారం తమ ఇంటికి కేటీఆర్ వచ్చారని, అది సాధారణ సమావేశమేనని తెలిపారు. పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే తన కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డి భువనగిరి ఎంపీగా పోటీ చేస్తాడని, ఒకవేళ అవకాశం రాకుంటే పార్టీ అభ్యర్థి ఎవరైనా వారి గెలుపు కోసం కృషి చేస్తామని స్పష్టంచేశారు. నల్లగొండ నుంచి సోనియా గాంధీ పోటీ చేసినా అమిత్‌రెడ్డి వెనకడుగు వేయడని, గతంలో ఇందిరాగాంధీపై తన మామ జైపాల్‌రెడ్డి పోటీ చేశారని, ఇప్పుడు సోనియాగాంధీపై తన కుమారుడు పోటీ చేస్తాడని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఓటమికి అనేక కారణాలు ఉన్నాయని వివరించారు. కేసీఆర్‌పై ప్రజల్లో వ్యతిరేకత లేదని, ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాలు కాంగ్రెస్‌కు అనుకూలించాయని పేర్కొన్నారు. ప్రభుత్వం మీద వ్యతిరేకత రావడానికి పెద్దగా సమయం అవసరంలేదని అన్నారు. నల్లగొండ జిల్లాలో కమ్యూనిస్టుల ప్రభావం తగ్గిందని పేర్కొన్నారు.

సీఎం వ్యాఖ్యలు ప్రివిలేజ్ కమిటీకి..

రేవంత్‌రెడ్డిపై ఇచ్చిన ప్రివిలేజ్ నోటీసును ఆ కమిటీకి పంపించామని గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా మండలి వైస్‌చైర్మన్ ఉంటారని, కమిటీని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాల్సి ఉన్నదని చెప్పారు. సభను ప్రశాంతంగా, సజావుగా జరపడమే తన ముందున్న లక్ష్యమని పేర్కొన్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తానని తెలిపారు. వచ్చే బడ్జెట్ సమావేశాలు పాత అసెంబ్లీహాల్‌లో జరుపుకోవాలని భావిస్తున్నామని, దీనికి అవసరమైన పనులను ఆగాఖాన్ ఫౌండేషన్ చేపడుతున్నదని వివరించారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు బ్రేక్

- రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ
- పరీక్షల సమయంలో ఎన్నికలపై టీచర్ల అభ్యంతరం
- నిర్వహణపై వెనక్కి తగ్గిన ప్రభుత్వం

కరీంనగర్/ హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయ, విద్యార్థి అన్ని వర్గాల నుంచి విమర్శలు రావడంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకొన్నది. సర్కారు బడుల్లో ఈ నెల 29న నిర్వహించ తలపెట్టిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలను నిలిపివేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన మంగళవారం రాత్రి ఉత్తర్వులిచ్చారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఎన్నికలు నిర్వహించరాదని పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లోని విద్యాధికారులందరూ ఈ నిబంధనలను పాటించాలని ఆదేశించారు. వాస్తవానికి, రాష్ట్రంలోని సాధారణ పాఠశాలలతోపాటు కేజీబీవీలు, మాడల్ స్కూళ్లు, జనరల్ గురుకులాలు, ఎయిడెడ్ తదితర పాఠశాలల్లో ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఉన్న పాఠశాలల్లో ఎస్ఎంసీలు ఎన్నికలు నిర్వహించాలని ఇటీవలే ఉత్తర్వులిచ్చారు. ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు ఈ నెల 18న షెడ్యూల్, మార్గదర్శకాలను పాఠశాల విద్యాశాఖ జారీచేసింది. ఈ నెల 20న నోటిఫికేషన్ జారీ, విద్యార్థుల తల్లిదండ్రుల జాబితా నోటీసు బోర్డులో ప్రదర్శించాలని, 22న తల్లిదండ్రుల జాబితాపై ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు అభ్యంతరాలు స్వీకరించాలని, 24న 11 గంటలకు తల్లిదండ్రుల తుదిజాబితా ప్రకటించాలని, 29న ఉదయం ఎస్ఎంసీ ఎన్నిక నిర్వహించాలని ఆదేశాలిచ్చారు. అయితే, పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై టీచర్లు, ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశారు.

'నమస్తే తెలంగాణ' కథనంపై సమీక్ష!

పాఠశాల విద్యాకమిటీ ఎన్నికలు పరీక్షల ముందు నిర్వహిస్తే విద్యార్థులకు జరిగే నష్టాలను 'నమస్తే తెలంగాణ' దినపత్రిక ఈ నెల 20న 'పరీక్షల ముందు పాఠశాల ఎన్నికలా..?' శీర్షిక పేరిట కథనం ప్రచురించింది. అందులో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకుల అభిప్రాయాలను కూడా ప్రచురించింది. ఈ ఎన్నికలను వాయిదా వేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం ముందుకు 'నమస్తే తెలంగాణ' తీసుకెళ్లింది. ఈ కథనంపై గడిచిన రెండు రోజులుగా సమీక్షలు నిర్వహించి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయసంఘాల నాయకుల అభిప్రాయాలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొన్నట్టుగా తెలిసింది. దీంతో ఎన్నికలు నిర్వహిస్తే బోధనకు పలు ఆటంకాలు ఏర్పడుతాయని 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన కథనం పూర్తి వాస్తవమని వారు తమ అభిప్రాయాలు చెప్పినట్టుగా తెలిసింది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర విద్యాశాఖ.. పాఠశాల కమిటీ ఎన్నికలను నిలిపివేస్తూ ప్రకటన జారీచేసింది. వెంటనే ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు పాఠశాల ఎన్నికలను నిలుపుచేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీ దేవసేన ఆదేశించారు. మొత్తం మీద ఎన్నికలు నిలిపివేడయంతో పాఠశాల ఉపాధ్యాయులు ఊపిరిపీల్చుకొన్నారు.

చౌడాపూర్ పోస్ట్‌మ్యాన్‌పై సస్పెన్షన్ వేటు

- ఉత్తరాలు బట్వాడా చేయనందుకు చర్యలు

కులకచర్ల, జనవరి 23 : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వికారాబాద్ జిల్లా చౌడాపూర్ పోస్ట్‌మ్యాన్ సస్పెండ్ అయ్యాడు. 'చెత్తకుప్పలో ఆధార్‌కార్డులు' శీర్షికతో ఆదివారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. మంగళవారం పోస్టల్ అధికారులు విచారించి.. పోస్ట్‌మ్యాన్ నర్సింహులు చేసింది తప్పేనని తేలడంతో సస్పెండ్ చేసినట్టు మహబూబ్‌నగర్ పోస్టాఫీస్ ఎంవో జగన్నాథరావు తెలిపారు. 2011 నుంచి వచ్చిన ఆధార్, పాన్‌కార్డులు, ఉత్తరాలను పంపిణీ చేయకుండా నర్సింహులు ఇంట్లోనే పెట్టుకోగా అతడి కుమార్తె చెత్త ట్రాక్టర్‌లో పడేయగా గ్రామస్థులు గుర్తించి తహసీల్దార్‌కు సమాచారం అందించడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

కృష్ణా బోర్డును వైజాగ్ తరలించలేం: చైర్మన్

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): కేఆర్ఎంబీ కార్యాలయాన్ని విశాఖపట్నం తరలించలేమని బోర్డు స్పష్టం చేసింది. నాగార్జునసాగర్ నుంచి విశాఖ 550 కిలోమీటర్లు, శ్రీశైలం నుంచి 650 కిలోమీటర్ల దూరంలో ఉన్నదని గుర్తు చేశారు. బోర్డును విశాఖకు తరలిస్తే సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడతాయని, విజయవాడకు తరలించే ప్రతిపాదనలను పరిశీలించాలని కేంద్రానికి నివేదించారు.

రూ.5 కోట్ల గన్నీ బ్యాగ్స్ గాయబ్?

- మెదక్ జిల్లాలో ఎంఎల్ఎస్ పాయింట్స్ అధికారులపై కేసు నమోదు

మెదక్, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లాలో ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.5 కోట్ల విలువైన గన్నీ బస్తాలు మాయమయ్యాయి. వీటిలో మెదక్ ఎంఎల్ఎస్ పాయింట్‌లో పాతవి 8.05 లక్షల గన్నీ బస్తాలకు రూ.2.08 కోట్ల విలువ కాగా, కొత్తవి 3.28 లక్షల గన్నీ బస్తాలకు రూ.2.49 కోట్ల విలువ ఉంటుంది. రామాయంపేటలో 87,830 కొత్త గన్నీ బస్తాలకు రూ.66.68 లక్షలు కాగా, పాతవి 2 లక్షల గన్నీ బస్తాలకు రూ.52.52 లక్షల విలువ ఉంటుంది. ఇవన్నీ కన్పించకుండా పోయాయని సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు.

కొన్నేండ్లుగా సాగుతున్న గోల్‌మాల్

కొన్నేండ్లుగా గన్నీ బస్తాల గోల్‌మాల్ జరుగుతున్నట్టు తెలిసింది. 50 సంచుల కట్టలు కట్టి ఇవ్వాల్సిన ఎంఎల్ఎస్ పాయింట్ అధికారులు, వారి ఇష్టారీతిగా గన్నీ బస్తాలను సరఫరా చేస్తుండటంతో అక్రమాలు చోటుచేసుకుంటున్నట్టు సమాచారం. మెదక్ ఎంఎల్ఎస్ పాయింట్ అధికారి నర్సింలుపై ఇటీవల క్రిమినల్ కేసు, రామాయంపేట ఎంఎల్ఎస్ పాయింట్ డీటీ సతీష్‌పై ఆర్ఆర్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. కాగా, పౌరసరఫరాల శాఖ ఒక్కో కొత్త గన్నీ బస్తాను రూ.75.92 చొప్పున ధరకు కొనుగోలు చేసింది. పాత బస్తాను రూ.26కు కొనుగోలు చేసింది. ఇంత పెద్ద మొత్తంలో మాయమైన గన్నీ బస్తాలు కొనుగోలు కేంద్రం నిర్వాహకుల వద్ద ఉన్నాయా? లేక ఎంఎల్ఎస్ పాయింట్ అధికారులు ఎవరికైనా విక్రయించారా? అనే విషయాలపై అధికారులు విచారించాల్సి ఉన్నది.

నాలుగు ఎంఎల్ఎస్ పాయింట్లపై కేసులు నమోదు..



మెదక్ జిల్లాలో ఇప్పటివరకు నాలుగు ఎంఎల్ఎస్ పాయింట్లపై కేసులు నమోదు చేశాం. ఇందులో మెదక్, రామాయంపేట, తూప్రాన్, చేగుంట ఎంఎల్ఎస్ పాయింట్ల అధికారులపై కేసులు నమోదయ్యాయి. మెదక్, రామాయంపేటలో సుమారు 15 లక్షల గన్నీ బస్తాలు మాయమయ్యాయి. వాటి విలువ సుమారు రూ.5 కోట్ల వరకు ఉంటుంది. ఈ గోల్‌మాల్‌లో ఎంతటి వారినైనా ఉపేక్షించం. చట్టప్రకారం వారి ఆస్తులు జప్తు చేస్తాం.

- డీ హరికృష్ణ, మేనేజర్, పౌరసరఫరాల శాఖ, మెదక్ జిల్లా

భువనగిరిలో కాంగ్రెస్, బీజేపీ మిలాఖత్

మున్సిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం • నేరేడుచర్ల విజయోత్సవంలో అపశ్రుతి

భువనగిరి మున్సిపల్‌లో అవిశ్వాసానికి హాజరైన కౌన్సిలర్లు

యాదాద్రి భువనగిరి/నేరేడుచర్ల, జనవరి 23 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్‌ను బలహీన పరిచేందుకు కాంగ్రెస్, బీజేపీ మిలాఖత్ అయ్యాయి. బయటకు బద్ధ శత్రువులమని నటిస్తున్న ఆ రెండు పార్టీలు.. యాదాద్రి భువనగిరి జిల్లాలో కలిసికట్టుగా ఉండి భువనగిరి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ను పడగొట్టాయి. బీఆర్ఎస్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్యకు వ్యతిరేకంగా జట్టు కట్టి అవిశ్వాస తీర్మానంలో నెగ్గాయి. మంగళవారం భువనగిరి పట్టణంలోని మున్సిపాలిటీలో నిర్వహించిన అవిశ్వాస తీర్మాన సమావేశానికి ఆర్డీవో అమరేందర్ హాజరయ్యారు. మున్సిపాలిటీలో మొత్తం 35 మంది సభ్యులు, ఒక ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. అవిశ్వాసం నెగ్గడానికి 24 మంది కౌన్సిలర్లు కావాలి. మొత్తం 31 మంది చేతులెత్తారు. వీరిలో 16 మంది బీఆర్ఎస్, తొమ్మిది మంది కాంగ్రెస్, ఆరుగురు బీజేపీ కౌన్సిలర్లు చేతులెత్తారు. నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కాలేదు. మొదట చైర్మన్, తర్వాత వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గింది. అలాగే.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబుపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నీలిగొండ వెంకటేశ్వర్లు సమక్షంలో అవిశ్వాస తీర్మానం ఏర్పాటు చేశారు. మొత్తం 16 మందికిగానూ.. అవిశ్వాస సమావేశానికి చైర్మన్ జయబాబు, ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు గైర్హాజరయ్యారు. మిగిలిన 13 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరై అందరూ అవిశ్వాసానికి చేతులెత్తి మద్దతు తెలపడంతో అవిశ్వాసం నెగ్గిందని ఆర్డీవో తెలిపారు. కాగా.. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబురాలు చేశారు. పటాకులు కాలుస్తుండగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అరిగెల్ల రవి చేతిలో ఉన్న బాంబు పేలి చేతివేళ్లు నుజ్జునుజ్జయ్యాయి.

దళిత ప్రజాప్రతినిధిపై అవిశ్వాసం వద్దు

- సూర్యాపేట పట్టణంలో దళిత సంఘాల నిరసన

బొడ్రాయిబజార్, జనవరి 23: సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణపై పెట్టిన అవిశ్వాసాన్ని ఉపసంహరించుకోవాలని దళిత సంఘాల నాయకులు, ప్రజలు డిమాండ్ చేశారు. మాల మహానాడు, ఎమ్మార్పీఎస్, టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం సూర్యాపేట పట్టణంలోని రైతుబజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 9వ వార్డు ప్రజలు రాస్తారోకో నిర్వహించారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు హసేన్, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు, ఎమ్మార్పీఎస్ నాయకుడు చిన్న శ్రీరాములు ఉన్నారు.

సూర్యాపేటలో రాస్తారోకో నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు, మహిళలు

ఇక్కత్ వస్త్రాల పేరుతో ప్రింటెడ్ చీరలు

- పోచంపల్లిలో గుర్తించిన విజిలెన్స్ అధికారులు
- 15 మంది బృందంతో ఆకస్మికంగా తనిఖీ
- 12 వస్త్ర దుకాణాలకు నోటీసులు

భూదాన్ పోచంపల్లి, జనవరి 23 : భూదాన్ పోచంపల్లిలో ఇక్కత్ వస్త్ర దుకాణాల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. 15 మంది బృందంతో ఏక కాలంలో 12 దుకాణాలపై దాడి చేశారు. ఇక్కత్ వస్త్రాలను పోలిన ప్రింటింగ్ చీరలు విక్రయిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేసి సీజ్ చేశారు. 12 వస్త్ర దుకాణాల వారికి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా స్టేట్ లెవెల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, రాష్ట్ర చేనేత జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ మునాసు వెంకటేశం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేనేత మగ్గాలపై తయారు చేయడానికి 11 రకాల చేనేత డిజైన్లను రిజర్వ్ చేసిందని, అందులో పోచంపల్లి ఇక్కత్ డిజైన్లు ఒకటి అని తెలిపారు. ప్రపంచంలో మొట్టమొదటిసారిగా చేనేతకు భౌగోళిక గుర్తింపు వచ్చిందని అన్నారు. ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల ప్రొడక్షన్‌ను ప్రింటెడ్ రూపంలో మరమగ్గాలపై తయారు చేసి చేనేత వస్త్రాలని చెప్పి విక్రయిస్తున్నారని అన్నారు. ఇక్కత్ వస్త్రాలు పోలిన డూప్లికేట్ చీరలను గుర్తించి 12 షాపుల్లో సీజ్ చేసి నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. పట్టుబడ్డ నకిలీ వస్త్రాలను చెన్నైలోని ల్యాబ్‌కు టెస్టింగ్ పంపిస్తామని, పవర్ లూమ్ ప్రింటింగ్ వస్త్రాలను తయారు చేస్తున్న కంపెనీలపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చేనేత వస్త్రాలకు హ్యాండ్లూమ్ మార్క్, సిల్క్ మార్క్ ఉంటేనే ఒరిజినల్ అని, చేనేత వస్త్రాలు తయారుచేసే తయారీదారులు రిజిస్టర్ చేసుకుని లోగోలను వినియోగించుకోవాలని సూచించారు.

మాట్రిక్స్ దవాఖానకు టీఎస్ఎంసీ నోటీసులు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మాదాపూర్‌లోని మాట్రిక్స్ దవాఖానకు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) నోటీసులు జారీ చేసింది. దవాఖాన వైద్యులతో అనర్హులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు సోషల్ మీడియా ద్వారా తమ దృష్టికి వచ్చినట్టు తెలిపింది. ఈ అంశంపై ఈ నెల 26లోపు వివరణ ఇవ్వాలని, తరగతులను ఆపేయాలని స్పష్టంచేసింది.

'ట్యూరిటో'.. విద్యార్థులకు బురిడీ!

- అనుమతి లేకున్నా కాలేజీ ప్రారంభం
- విద్యార్థులు చేరాక క్లాసెస్‌గా మార్పు
- రశీదులో ఒకటి.. బోనఫైడ్‌లో మరోటి
- మరికొందరికి ట్యూరిటో ప్రైవేటు లిమిటెడ్ పేరిట రశీదులు
- ఇద్దరితోనే తరగతుల నిర్వహణ
- కాలేజీ యాజమాన్యంతో తల్లిదండ్రుల వాగ్వాదం
- ఇది కామనేనన్న ప్రిన్సిపాల్
- వివరాలు సేకరించిన రంగారెడ్డి ఆర్ఐఈవో... విచారణ చేస్తానని వెల్లడి



ట్యూరిటో కళాశాలలో ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, వనస్థలిపురంలోని ట్యూరిటో కళాశాల భవనం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 23 (నమస్తే తెలంగాణ)/వనస్థలిపురం: ట్యూరిటో జూనియర్ కళాశాల అంటూ బోర్డు పెట్టారు.. జేఈఈ, నీట్ క్లాసులు కూడా చెబుతామంటూ గొప్పలు పలికారు.. గత విద్యా సంవత్సరం పదుల సంఖ్యలో విద్యార్థులు చేరారు. కొన్ని నెలలు గడిచాయో, లేదో బోర్డు తిప్పేశారు. ట్యూరిటో జూనియర్ కళాశాల కాస్తా ట్యూరిటో క్లాసెస్‌గా మారింది. ఇదేంటని తల్లిదండ్రులు మంగళవారం మూకుమ్మడిగా వెళ్లి ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తే.. 'ఇదంతా కామనే' అంటూ ఆయన చెప్పిన సమాధానం విని విస్తుపోయారు.

వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లో నిరుడు ట్యూరిటో జూనియర్ కళాశాల పేరిట ఒక భవనంలో కళాశాలను ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల ఉన్న వారు తమకు కళాశాల దగ్గర అవుతుందనే భావనతో అందులో చేరారు. అనుమానం వచ్చి కొందరు అనుమతి గురించి ప్రశ్నిస్తే త్వరలోనే వస్తుందంటూ యాజమాన్యం నమ్మబలికింది. కొంతకాలం తర్వాత కళాశాల బోర్డును క్లాసెస్‌గా మార్చారు. ఫీజు చెల్లించిన వారికి వెస్ట్ మారేడుపల్లిలోని ఎక్సెల్ కళాశాల పేరిట రశీదులు ఇచ్చారు. మరికొందరికి ట్యూరిటో ఇండి ప్రైవేట్ లిమిటెడ్ పేరిట రశీదులు ఇచ్చారు. దీని చిరునామా జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 44, ప్లాట్ నంబరు 773గా ఉంది. మొదటి సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు హాల్‌టికెట్లు బాలాపూర్ మండలం మల్లాపూర్‌లోని యవతరంగ్ జూనియర్ కళాశాల పేరిట వచ్చాయి. వాటిని చూసి కొందరు తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌ను అడగ్గా వారికి ఏదో ఒక సమాధానం చెప్పి నెట్టుకొచ్చారు.

ఇద్దరితోనే తరగతుల నిర్వహణ

కళాశాల పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ రెండో సంవత్సరం అంటే 2023-24 విద్యా సంవత్సరానికి కూడా పదుల సంఖ్యలో అడ్మిషన్లు తీసుకున్నారు. ప్రస్తుతం కాలేజీలో 140 మంది వరకు విద్యార్థులు ఉన్నట్టు తెలిసింది. ఇద్దరు లెక్చరర్లతోనే మధ్యాహ్నం 12 వరకు మాత్రమే తరగతులు నిర్వహిస్తున్నారు. ఇటీవల లాంగ్వేజెస్‌కు సంబంధించి ప్రత్యేకంగా లెక్చరర్లను పిలిపించి మూడు రోజుల్లోనే మొత్తం సిలబస్ పూర్తి చేసినట్టు విద్యార్థులు తెలిపారు. ఒకవైపు పరీక్షలు సమీపిస్తుండటం, సిలబస్ పూర్తికాకపోవడంతో పాటు ల్యాబ్‌కూడా లేకపోవడంతో ప్రాక్టికల్స్ పరిస్థితి ఏంటని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ తతంగంపై 'నమస్తే తెలంగాణ' ప్రిన్సిపాల్ స్వామిని వివరణ కోరగా, లోకంలో జరుగుతున్నదే తామూ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఈ విషయంపై రంగారెడ్డి ఆర్ఐఈఓ వెంకయ్య నాయక్‌ను 'నమస్తే తెలంగాణ' సంప్రదించగా ఇప్పటివరకు తమ దృష్టికి ఈ విషయం రాలేదని వివరాలు తీసుకున్నారు. దీనిపై విచారణ చేస్తానని స్పష్టం చేశారు.

అవిశ్వాసాలపై వివరణ ఇవ్వండి

- ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): పలు మున్సిపాలిటీ చైర్మన్లకు జారీ అయిన అవిశ్వాస తీర్మానాలపై వివరణ ఇవ్వాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. తెలంగాణ మున్సిపల్ చట్టం-2019 సెక్షన్ 37లో అవిశ్వాస తీర్మానం ఆమోదించడానికి సంబంధించిన విధానం లేదనే అప్పీల్ పిటిషన్లపై ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని ఆదేశించింది. ప్రతివాదులైన పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్లతోపాటు సంగారెడ్డి, మేడ్చల్, యాదాద్రి-భువనగిరి, జనగామ కలెక్టర్లకు నోటీసులు జారీ చేసింది. సదాశివపేట, ఆందోల్-జోగిపేట, జవహర్‌నగర్, జనగామ, ఆలేరు మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్లపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలపై నోటీసులు జారీచేసింది. ఆయా మున్సిపల్ కార్పొరేషన్లల్లో జారీచేసిన అవిశ్వాస తీర్మానాల్లో సింగిల్ జడ్జి జోక్యం చేసుకోకపోవడంతో వాటి చైర్మన్లు అప్పీల్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వ వాదనల తర్వాత ఉత్తర్వులు ఇస్తామని, విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.